

మోదీ ప్రభుత్వంపై దేశ ప్రజల విశ్వాసం

- రాబోయేది ఎన్డీయే సర్కారు
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తరుణ్‌చుగ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 4: కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై దేశ ప్రజలు విశ్వాసంతో ఉన్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ అన్నారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దేశాభివృద్ధికోసం పదేళ్లుగా ఎంతో శ్రమించిందన్నారు. లక్ష్యంతో, వికసిత్ భారత్ సంకల్పంతో అడుగులు వేస్తుందన్నారు. పదేళ్లుగా మోదీ ప్రభుత్వ ఆలోచన విధానాలు, దేశాభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలు సత్ఫలితాలనిచ్చాయని తెలిప్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశంలోని ప్రతి గ్రామీణ ప్రాంతంలోని ప్రజలను కార్యకర్తలు కలుసుకుని ప్రధాని మోదీ సాధించిన విజయాలను వివరిస్తామన్నారు. కాంగ్రెస్ పాలనను తొంభై రోజులు చూస్తామనుకున్నామని, అరవై రోజుల్లోనే వారి అవినీతి బట్టబయల వుతుందన్నారు. తెలంగాణ సంపదను నాడు బీఆర్ఎస్ దోచుకుంటే నేడు రేవంత్‌రెడ్డి సర్కార్ దోచుకునే పనిలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి మన సంస్కృతి సాంప్రదాయాలు నచ్చవన్నారు. దేశ ప్రజల ఆలోచన విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్ణయాలు ఉంటాయన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీజేపీజిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ ప్రభారి మీసాల చంద్రయ్య, పార్లమెంట్ కన్వినర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, చెన్నమనేని వికాస్‌రావు, గంద్ర నళిని, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● పార్లమెంట్ స్థాయి బీజేపీ ప్రవాస్ యోజన సమావేశం

కరీంనగర్ పార్లమెంటరీ స్థాయి ప్రవాస్ యోజన ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగింది. కరీంనగర్ పార్లమెంటరీస్థాయి ప్రవాస్‌యోజన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ హాజరయి ముఖ్యనాయకులకు దిశా నిర్ధేశం చేశారు. కరీంనగర్ వచ్చిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ జ్ఞాపికను అంద జేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో?

- అసంపూర్తి పనులతో అవస్థలు
- నాలుగునెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు





కరీంనగర్‌లోని విద్యానగర్‌లో అధ్వానంగా రోడ్లు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4: మట్టిరోడ్లతో అవస్థలు పడుతూ తమ రోడ్లను బాగు చేయాలని కోరుతూ వచ్చిన నగరంలోని పలుకాలనీవాసులకు కొత్త సమస్యలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం హామీ నిధులతో నగరంలో రోడ్ల అభివృద్ధికి భూమి పూజలు చేశారు. అక్టోబరు, నవంబరులో నగరంలోని పలు డివిజన్లలో సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. కొన్ని డివిజన్లలో పనులు పూర్తికాగా, మరికొన్ని డివిజన్లలో మట్టిరోడ్లను తవ్వి వదిలిపెట్టారు. మరికొన్ని చోట్ల కంకర, డస్ట్ వేసి సీసీ వేసే పనులను ప్రారంభించారు. అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు ప్రారంభం కాని చోట వాటి ఊసెత్తడం లేదు. పనులు ప్రారంభించిన రోడ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మూడు, నాలుగునెలలుగా రోడ్లను తవ్వి వదిలి అసంపూర్తిగా వదిలి వేయడంతో ఆయా కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

● దెబ్బతిన్న మంచినీటి పైపులైన్లు

రోడ్ల తవ్వకంతో యూజీడీ, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. ఇంటి ముందర ర్యాంపులను తొలగించారు. కంకర పోసి వదిలిన రోడ్లపై నడిచేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర పోసిన రోడ్లపై వాహనాలు దెబ్బతింటున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. ర్యాంపులను, డ్రైనేజీలను తొలగించడంతో డ్రైనేజీ నీళ్లు రోడ్లపై నిలిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని నగరవాసులు వాపోతున్నారు. మరికొన్ని చోట్ల పైపులైన్లు దెబ్బతినడంతో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ర్యాంపులను తొలగించడంతో ఇళ్లలోకి వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. ఎన్నికల తర్వాత తమ వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదని, తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో నిధులు ఇస్తారో.. లేదోననే అనుమానంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు.

> **అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి**
>
> **- మేయర్ సునీల్‌రావు**
>
> నగరంలో మిగిలిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత బడ్జెట్‌లో రూ.200 కోట్లను కేటాయించి విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సహకరించి నిధులు కేటాయిస్తే ఏడాదిలో నగరంలోని అన్ని రోడ్లను పూర్తి చేస్తాం.

పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నది

- సీపీ అభిషేక్ మొహంతి





ట్రాఫిక్ ఎస్ఐ ఇషాక్‌కు పతకాన్ని ధరింపజేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి, మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4: పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. జిల్లాల్లో పనిచేసే సాయుధ బలగాలకు నిర్వహించే యాన్యువల్ మొబిలైజేషన్ శిక్షణ ఆదివారం కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని, పోలీసు ఉద్యోగంలో రాణించాలంటే ఫిజికల్ ఫిట్‌నెస్‌తోపాటు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే సిబ్బందికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడ తాయన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి సీపీ ప్రశంసాపత్రాలను అందజేశారు. మొబిలైజేషన్ ముగింపు సందర్భంగా ఆరు ప్లాటూన్‌లతో కూడిన పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం సురేష్ ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించి అద్భుతంగా పరేడ్ ప్రదర్శించారని సీపీ ప్రశంసించారు.

● అధికారులు, సిబ్బందికి పతకాలు అందజేత

రాష్ట్రవ్యాప్తంగా పోలీసుశాఖలో వివిధ స్థాయిల్లో పని చేస్తూ ఉత్తమ సేవలందించినందుకుగాను పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు సేవా పతకాలను ప్రకటించింది. కరీంనగర్ కమిషనరేట్‌లో 22 మందికి తెలంగాణ రాష్ట్ర సేవా పతకం, ముగ్గురికి ఉత్కృష్ట సేవా పతకం, ఇద్దరికి అతి ఉత్కృష్ట సేవా పతకాలు లభించాయి. ఏఎస్ఐ సయ్యద్ అంజద్, హెడ్‌కానిస్టేబుల్ పి రవీందర్‌లకు అతి ఉత్కృష్ట సేవా పతకాలు, కానిస్టేబుళ్లు ఏ తిరుపతి, ఎన్ ప్రవీణ్‌కుమార్‌లకు ఉత్కృష్ట సేవా పతకాలు, ఏఎస్ఐలు నూరుద్దీన్, లక్ష్మారెడ్డి, అబ్దుల్ రజాక్, గౌస్‌ఖాన్, కిషన్, దామోదరరావు, మల్లయ్య, గోపాల్‌రెడ్డి, సయ్యద్ మోయినొద్దీన్, మల్లారెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు సారంగధర, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, సంపత్, తిరుపతి, వీరస్వామి, శ్రీశైలం, శ్రీనివాస్, లింగారెడ్డి, చంద్రమౌళికి సేవా పతకాలను పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు సి రాజు, ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీలు నరేందర్, కరుణాకర్‌రావు, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రతాప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దేవుళ్లు

- పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించండి
- ఆర్థోపెడిక్ సర్జన్ల రాష్ట్ర సదస్సులో ఎంపీ బండి సంజయ్



ఎంపీ బండిసంజయ్‌కు జ్ఞాపికను అందజేస్తున్నడాక్టర్లు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4: సమాజంలో ఇతర వృత్తుల కంటె ఎక్కువ గౌరవం వైద్య వృత్తికే ఉందని, అందుకే వైద్యులను ప్రత్యక్ష దేవుళ్లుగా బావిస్తూ వైద్యో నారయణోహరి అని భగవంతుడితో పోలుస్తారని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థోపెడిక్ సర్జన్లరాష్ట్ర సదస్సు కరీంనగర్‌లో నిర్వహించు కోవడం అభినందనీయమన్నారు. నిత్యం బిజీగా ఉండే డాక్టర్లు సుమారు వెయ్యి మంది ఒకచోట కలుసుకోవడం మామూలు విషయం కాదన్నారు. జూనియర్ డాక్టర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సీనియర్లపై ఉందన్నారు. హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోవడం తనకు చాలా బాధ కలిగిస్తుందన్నారు. సకాలంలో బాధితులను ఆదుకోవాలన్నారు. ఆయుష్మాన్‌భారత్ పథకంలో ఆర్థోపెడిక్‌కు సంబంధించిన చికిత్సలు ఉన్నా యని తెలిపారు. ఎంపీగా తననుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాల న్నా, తన చేతనైనంతవరకు చేసేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. పేదలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించేందుకు సహాయపడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారి స్వామి, మోతిలాల్, గురువారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కల్పించాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4: కేన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, ఆ వ్యాధిపై అందరికీ అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని టీటీడీ కళ్యాణ మండపంలోఉచిత క్యాన్సర్ అవగాహన, నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. మహిళలు భయపడకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చున్నారు. కార్యక్రమంలో మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు వాల రమణారావు, గుగ్గిళ్ల జయశ్రీ, ఎడ్ల సరిత, పిట్టల వినోద, నాంపల్లి శ్రీనివాస్, గంట శ్రీనివాస్, కుర్ర తిరుపతి, వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి, ప్రతిమ, చల్మెడ వైద్య కళాశాలల వైద్యులు పాల్గొన్నారు.

రేపు చొప్పదండిలో జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: సాఫ్ట్‌బాల్ జూనియర్ బాలుర జట్టు ఎంపిక పోటీలను ఈనెల 6న నిర్వహిస్తున్నామని సాఫ్ట్‌బాల్ సంఘం నిర్వాహణ కార్యదర్శి ఎ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. చొప్పదండి జడ్పీహెచ్ఎస్ మైదానంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ వ్యక్తిగత కిట్‌తోపాటు గ్లౌవ్స్, స్లగ్గర్ బాల్‌తో హాజరు కావాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈనెల 10,11తేదీల్లో హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడాకారులు చొప్పదండి పాఠశాల మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్మురోజు కృష్ణకు రిపోర్టు చేయాని సూచించారు.

ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: రెజ్లింగ్ క్రీడాకారుల జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఈనెల 6న నిర్వహిస్తున్నామని రెజ్లింగ్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల రమేశ్‌రెడ్డి, మహ్మద్ కరీం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ పోటీలను అండర్-15, అండర్-20 విభాగాల్లో బాల బాలికలకు నిర్వహిస్తున్నామన్నా రు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

పంట నష్ట పరిహారం వచ్చేదెన్నడు...?

యాసంగిలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు.. నష్ట పోయిన రైతులు



ఘనపూర్ గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



బొమ్మకల్ గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న (ఫైల్)

సైదాపూర్, ఫిబ్రవరి 4: ఆరుగాలం కష్టపడి పంట పండించి కోతకు వచ్చిన సమయంలో మార్చి, ఏప్రిల్‌లో అకాల వర్షం కురిసి చాలా మంది రైతులు పంటలు నష్ట పోయారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారులతో సర్వే చేయించి, అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులకు పంట నష్ట పరిహారం కింద ఎకరాకు 10 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పంటలు సర్వే చేసి దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి నివేదిక పంపించారు. మార్చిలో దెబ్బతిన్న పంటల పరిహారం చెల్లించిన అప్పటి ప్రభుత్వం ఏప్రిల్‌లో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెలించలేదు. ఇంతలో ఎన్నికలు రావడంతో పంట నష్ట పరిహారం నిలిచిపోయింది. తరువాత పరిణామాలతో ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఇప్పటి వరకు పంట నష్ట పరిహారం గురించి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయ లేదు. ప్రభుత్వ ప్రకటన కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

● భారీగా దెబ్బతిన్న పంటలు

సైదాపూర్ మండలంలో ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షానికి వరి, మొక్కజొన్న పంటలతో పాటు ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా 1271.27 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్ట పరిహారం అందలేదు

- వేముల రవీందర్, రైతు, బొమ్మకల్



నేను గత యాసంగిలో మూడెకరాల మొక్కజొన్న పంట వేశాను. ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయాధికారులు సర్వే చేసి పంట నష్టం వివరాలు రాసుకొని వెళ్లారు. ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం వెంటనే చెలించాలి.

సారు.. మమ్మల్ని ఆదుకోండి

- ఎలబోయిన చంద్రమోహన్, రైతు, బొమ్మకల్



నేను గత యాసంగిలో రెండెకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. అకాల వర్షానికి పంట దెబ్బతిన్నది. అప్పటి ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వం అయినా పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

మంథనిరూరల్, ఫిబ్రవరి 4: మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన చంద్రయ్య(50) అనే రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆదివారం మృతిచెందాడు. చంద్రయ్య పొలం వద్దకు బైక్‌పై వెళ్లాడు. పని పూర్తి చేసుకుని మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి మీదకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 4: జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని సైకాలజిస్ట్ రవికాంత్ అన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

వెంటాడుతున్న మొగి పురుగు

- తెగులు ఉధృతికి ఎర్రబారుతున్న పొలాలు
- దిగుబడిపై ప్రభావం
- నాట్లు వేసిన పదిహేను రోజుల నుంచే పంటను ఆశిస్తున్న పురుగు
- ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు



జిల్లాలో మొగిపురుగు సోకిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరి రైతును మొగి పురుగు వెంటాడుతోంది. గత యాసంగిలో సోకినట్లుగానే ఈ సీజన్‌లో సైతం వరి పంటలను మొగి పురుగు ఆశిస్తోంది. భారీ వర్షాల కారణంగా వానాకాలం వరి పంట అన్నదాతకు నష్టాలే మిగిల్చింది. ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. ఈ యేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాయి. దీనికి తోడు కాలువల ద్వారా సాగు నీరు అందిస్తుండడంతో రైతులు యాసంగిలో ముమ్మరంగా వరి నాట్లు వేశారు. వేసిన 15 రోజుల్లోనే వరిలో మొగి పురుగు సోకి కాండం కుళ్లిపోతోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో అక్కడక్కడ మొగి పురుగు సోకుతోందని నిపుణులు అంటున్నారు. తెగులు ఉధృతికి పంట ఎర్రబారుతోందని అన్నదాతలు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ సమాచారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుత యాసంగిలో వరి సాగు సుమారు 30.43 లక్షల ఎకరాల్లో ఉండగా అందులో జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2,69,817 ఎకరాల్లో వరి సాగు అవుతోంది. వరి పైర్లు కొన్ని చోట్ల నారుమడి దశలోనూ, మరికొన్ని ప్రాంతాలలో పిలకదశలోనూ ఉన్నాయి.

● అన్నదాతకు అదనపు వ్యయం..

జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో మొగి పురుగు ప్రభావం అధికంగా ఉంది. ప్రతీ యేటా మొగి పురు ఉధృతి పెరుగుతోంది. రైతులు పంట మార్పిడి చేయడం లేదు. పొలం పూర్తిగా ఎండిపోకుండానే మళ్లీ సాగు ప్రారంభించడం, దుక్కి మందులో సల్ఫర్ అధికంగా వాడడంతో పొలాలు వదులై మొగి పురుగు ఉధృతి పెరుగుతోందని వ్యవసాయ నిపుణులు, అధికారులు అంటున్నారు. ప్రస్తుత యాసంగిలో వరి నారుమడులపైనే రెక్కల పురుగు ఉంటుంది. నివారణ కోసం పురుగు మందు పిచికారి వేసి కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేశారు. పురుగు పెట్టిన గుడ్లు ఎదిగి కాండం కింది భాగాన్ని తొలుస్తున్నాయి. తర్వాత దశలో కంకి తెల్లగా మారుతోంది. చివరికి దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు అదనంగా వ్యవసాయ పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం ఎక్కువవుతోంది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



మొగి పురుగుతో ఎర్రబారిన వరి



నివారణ చర్యలు తీసుకుంటేనే ఫలితం..

ఈ యాసంగిలో నారుమడి, పిలక దశల్లో మొగి పురుగు అధికంగా గమనించాం. నారుమడిలో 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జి గుళికలు వేయాలి. నారుమడిలో వేయకపోతే 15 రోజుల వయస్సున్న, పిలక దశలో ఉన్న వరి పైరులో తప్పకుండా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 8 కిలోలు, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జి గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలి. అనంతరం వరి పంట చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు రెక్కల పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం, ఎస్‌పి 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఐసోసైక్లోసిరమ్ 0.6 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.

- బలరాం, సీనియర్ శాస్త్రవేత్త, జగిత్యాల జిల్లా

నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సమీక్ష

● సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశం


సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లే ఆఫ్‌తో మూసివేసిన నిజాం షుగర్స్ కర్మాగారాలను పునరుద్ధరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం హైద్రాబాద్‌లోని సీఎం పేషీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పరిచారు. నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట, మెదక్ జిల్లా ముంబోజుపల్లిలో గల నిజాం షుగర్ పునరుద్ధరణ కోసం పరిశీలించాల్సిన అంశాలు, కొన్ని సంవత్సరాలుగా కర్మాగారాలు మూసివేసి ఉండడం వల్ల మిషనరీ పరిస్థితి, రైతుల ఆసక్తి, చెరుకు సాగు తదితర అంశాలపై పలు వివరాలను సేకరించారు. నిజాం షుగర్స్ పునరుద్ధరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఛైర్మన్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలతో కలిసి సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపారు. ఏ విధంగా నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపించాలి, ఆర్థిక పరిస్థితి, బకాయిల చెల్లింపు, మిషనరీ పునరుద్ధరణ, ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి, రైతులకు చేకూర్చాల్సిన మేలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అతి త్వరలో చెరుకు రైతులకు తీపి కబురు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎన్నికల సందర్భంగా చెరుకు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారని వివరించారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 4: ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించవచ్చని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మశాలి కళ్యాణ భవనం వరకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మశాలి కల్యాణ భవనంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేం పావని మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా సమస్యలతో కార్మికులు సతమతం అవుతూ కష్టాలను నష్టాలను ఓర్చుకుంటూ విద్యార్థులకు సేవలనందిస్తున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మెకు వెళ్లడంతో అప్ప టి ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. వేయి రూపాయల నుంచి మూడు వేల రూపాయల వేతనా లు పెంచడానికి అంగీకరించిందన్నారు. ఎన్నికల సమయం కావడం వల్లే అప్పటి ప్రభుత్వం వేతనాలను పెంచుతామన్నారు తప్పా చిత్తశు ద్ధితో హామీనివ్వలేదని అర్థం అయిందన్నారు. మధాహ్న భోజన వర్కర్లకే వేతనాలు దిక్కులేదం టే గత ప్రభుత్వం అల్పాహారం అంటూ కార్మికులపై అదనపు భారం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యతతో పోరాటాలు చేస్తే తప్పా ఈ ప్రభుత్వాలు దిగిరావని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, పెన్షన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రక టించిన కార్మికులకు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. కార్మికులకు నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం కార్మికులకు ప్రభుత్వం రెండు జతల యూనిఫాం ఇవ్వాలని అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, రాష్ట్ర నాయకుడు ధర్మల రామ్మూర్తి, జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మన్, జిల్లా ఉపాధ్యక్షులు పంతం రవి, లక్ష్మి, మహేశ్వరీ, మల్లవ్వ, కొమరవ్వ, సాయిలు, కొమరయ్య, హసీనాబేగం లావణ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, వివిధ మండలాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేములవాడలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 4: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతరను పురస్కరించుకుని రోజు రోజుకు ఆలయానికి భక్తుల రాక పెరుగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న క్షేత్రానికి తరలివచి ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. ఆదివారం తెల్లవారుజామునే భక్తులు ఆలయ ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ క్యూలైన్‌ల ద్వారా భక్తులు రాజన్న ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు శ్రీస్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. తదనంతరం అనుబంధ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలను నెత్తిలో పెట్టుకుని డప్పుచప్పుల్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు.

మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, ఫిబ్రవరి 4: గంగాధర మండలం గర్షకుర్తిలో ఆదివారం మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలో ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

రాయికల్, ఫిబ్రవరి 4: రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మహేందర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. లంచం కోసం వేధిస్తున్నారనే ఆరోపణలతో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు. రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో మ హేందర్ కోర్టు విధులు నిర్వర్తిస్తుంటారు. కానిస్టేబుల్ మహేందర్ ఓ కేసు విష యంలో తరచూ డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అల్లీపూర్ గ్రామానికి చెందిన రమేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. పూర్తి ఆధారాలు సమర్పిం చాడు. దీనిపై విచారణ చేసిన ఎస్పీ మహేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హోటల్‌ను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు


హోటల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 4: మున్సిపాలిటీలో చేసుకున్న ఒప్పందానికి భిన్నంగా వ్యవహరించి, అనుమతులు లేకుండా అనధికారికంగా ఆనంద్ భవన్ హోటల్ పేరుతో వ్యాపారంపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. ఆదివారం వేకువ జామునే పట్టణంలోని పార్క్ ఎదుట టౌన్ హాల్‌లో నిర్వహిస్తున్న ఆనంద్ భవన్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ ఆనంద్ భవన్‌పేరుతో నడపబడుతున్న ఈ హోటల్ ఒప్పందానికి వ్యతిరేకంగా నడుపబడుతుందని, అందుకే ఈ హోటల్‌ను సీజ్ చేసి నట్లు తెలిపారు. ఇందులో పని చేస్తున్న సిబ్బంది, వారికి సంబంధించిన సామానులను భవనం నుంచి ఖాళీ చేయించామన్నారు. హోటల్ మూసివేసే క్రమంలో అన్ని విధాలుగా నిబంధనలు పాటించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వ హిస్తున్న ఈ హోటల్‌కు నోటీసులు అందించామని, నిర్వాహకుల నుంచి వచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేనందునే చర్యలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఈ అంశంపై పలు పత్రికల్లో వార్తా కథనాలు రావడం, ప్రజలనుంచి అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, అనూహ్యంగా ఆదివారం వేకువజామునే సీజ్ చేయడం ప్రస్తుతం జగిత్యాల పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

డబ్లింగ్ పనులతో పలు రైళ్ల రాకపోకలు రద్దు


పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మౌలాలి నుంచి సనత్‌నగర్ రైల్వే స్టేషన్ మధ్య డబ్లింగ్ పనులతో పాటు నాన్‌ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు పలు రైళ్లను రద్దుచేశారు. 17011/12 హైదరాబాద్ నాంపెల్లి నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు నడిచే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేశారు. 17233/34 నంబర్‌గల భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఈ రైలు కేవలం కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్యనే నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4: మండలంలోని డబ్బా గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఎలాలా రవికాంత్ రెడ్డి (45) మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం అమ్మక్కపేటకు చెందిన రవికాంత్‌రెడ్డి బైక్‌పై డబ్బ నుంచి అమ్మ క్కపేటకు వెళ్తున్నాడు. డబ్బ గ్రామానికి చెందిన గరికే ప్రసాద్ బైక్‌పై గ్రామ శి వారు నుంచి ఎదురుగా వస్తూ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీ వ్ర గాయాలైనట్లు తెలిపారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మాధ్యలో రవికాంత్‌రెడ్డి మృతి చెందాడు. ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా నిజామాబాద్ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. రవికాంత్‌రెడ్డికి ఇద్దరు కొడుకులు, భార్య ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెప్ప వాలని రాత్రి కవితా సంపుటికి జాతీయ పురస్కారం

- అవార్డు ఫలితాలు వెల్లడించిన రంగినేని ట్రస్ట్ కన్వీనర్ లక్ష్మణ్




అవార్డు పొందిన కవిత్వ సంకలనం, కవి వంశీకృష్ణ

సిరిసిల్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలను ప్రోత్సహిస్తూ ఉత్తమ సాహిత్యానికి బాటలు వేస్తున్న సిరిసిల్లకు చెందిన రంగినేని సుజాతమోహన్‌రావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ ప్రతీ సంవత్సరం జాతీయస్థాయిలో అందిస్తున్న రంగినేని ఎల్లమ్మ జాతీయ సాహిత్యా పురస్కారం 2023 ఫలితాలను ట్రస్ట్ అధ్యక్షుడు రంగి నేని మోహన్‌రావు, అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ ఆదివారం వెల్లడించారు. ట్రస్ట్ ద్వారా ఒక సంవత్సరం కథాసంపుటికి, మరో సంవత్సరం కవితా సంపుటికి అవార్డులను అందిస్తున్నారు. 2023 సంవత్సరానికి పోటికి వచ్చిన కవితా సంపుటిల్లో వరంగల్ జిల్లాకు చెందిన కవి, కథకుడు, విమర్శకుడు వంశీ కృష్ణ వెల్లడించిన రెప్ప వాలని రాత్రి కవితా సంపుటి ఎల్లమ్మ జాతీయ పురస్కారం దక్కించుకుంది. మార్చిలో ట్రస్ట్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. వరంగల్ జిల్లా గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన తాటికొండల వంశీ కృష్ణ సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. 1990 నుంచి రచన, వ్యాసాంగాన్ని ప్రారంభించి ఐదు కవిత్వ సంపుటాలు, రెండు కథ సంపుటాలు, రెండు సినిమా వ్యాస సంకలనాలు వెలువరించారు. కవిగా కాకుండా మంచి విమర్శకుడిగా కూడా తన రచనలను కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ సినీ విమర్శకుడి అవార్డును కూడా వంశీ అందుకున్నారు. రంగినేని జాతీయ పురస్కారానికి ఎంపికైన వంశీని పులువురు, రచయితలు, కవులు అభినందించారు.

పరిహారం కోసం పడిగాపులు

- 15 ఏళ్లుగా మిడ్‌మానేరు నిర్వాసితుల నిరీక్షణ
- గత ప్రభుత్వంలో పరిహారం చెల్లింపుపై నిర్లక్ష్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు


మానువాడలో నిర్మించిన మధ్య మానేరు జలాశయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 4: తమ సర్వస్వాన్ని దారపోసి మధ్యమానేరు జలాశయానికి ఊపిరిపోసిన నిర్వసితులు పరిహారం కోసం పడిగాపులుకాస్తున్నారు. తమవిలువైన భూములు, తమ గొడ్డుగోద ఉపాధిని వదిలేసి పొట్టచేత పట్టుకుని అర్‌అండ్‌అర్ కాలనీలకు పొట్టచేతబట్టుకుని ఉన్నఫలంగా తరలివచ్చారు. బోయినపల్లి మండలం మానువాడ వద్ద ఏర్పాటు చేసిన మధ్యమానేరు జలాశయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 11 గ్రామాలు ముంపు గ్రామాలుగా ప్రకటించారు. ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతలఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజి పల్లి, వర్దవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008 సంవత్సరంలో 12 గ్రామాల్లో 10,683 కుటుంబాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించి గెజిట్ ప్రకటించారు. ముంపునకు గురవుతున్న ఒక్కో కుటుంబానికి రెండు గుంటల స్థలంతోపాటు వృత్తి ఆధారంగా పరిహారం చెల్లించేందుకు నిర్ణయించారు. నిర్వాసితులకు 2010 సంవత్సరం నుంచి పరిహారం చెల్లించడం ప్రారంభించారు. 10,683 కుటుంబాలకు గాను 10,044 కుటుంబాలకు మాత్రమే పరిహారం చెల్లించారు. మిగతా 639 మంది నిర్వాసిత కుటుంబాలకు 219 మంది కుటుంబాలకు చెందిన నిర్వాసితుల సంతకాలను అధికారులు సేకరించి బడ్జెట్ కోసం రూ. 20.22 కోట్లుతో నివేదికను ప్రభుత్వానికి అందించారు. మిగిలిన 420 మంది నిర్వాసిత కుటుంబాల్లో కొంత మంది కోర్టును ఆశ్రయించగా మరికొంత మంది వృత్తి మార్పులు తప్పులుగా పడటంతో పాటు వివిధ కారణాలతో పరిహారం తీసుకోలేదు. వీరి కోసం మరో రూ. 30.61 కోట్లు చెల్లించాల్సిన అవసరం వుందని తెలుస్తోంది. గత ప్రభుత్వం విడతల వారీగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తు 10 సంవత్సరాలు గడిచిన పూర్తిస్థాయిలో నిర్వాసితులకు పరిహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, నిర్వాసితుల పక్షాన నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నిర్వాసితులు గంపెడు ఆశతో వున్నామని చెబుతున్నారు.

● 501 మంది యువతకు అందాల్సిన పరిహారం..

మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురవుతున్న నిర్వాసిత యువతి, యువకులకు ఒక కటాఫ్ డేట్‌తో ప్రతీ ఒక్కరికి రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముంపు గ్రామాల్లో మొత్తం 3,917 మంది యువతను గుర్తించారు. అందులో యవతులు 2,303 మందికి గాను 1,879 మందికి రెండు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించారు. ఇంకా 335 మంది యువతల వద్ద సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించారు. మిగతా 89 మంది యువతల సంతకాలు మాత్రమే సేకరించారు. వారికి ఇంకా పరిహారం చెల్లించాల్సివుంది. కాగా 1,614 మంది యువకులకు గాను 1,537 మందికి పరిహారం చెల్లించగా 28 మంది యువకుల సంతకాలు సేకరించి బడ్జెట్ కోసం నివేదికను ప్రభుత్వానికి పంపించారు. మిగిలిన 49 మంది యువకులు వివిధ కారణాలతో పరిహారం తీసుకోవడం లేదు వారికి ఇంక చెల్లించాల్సి ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు..

- నాగుల శంకరయ్య, సంకెపల్లి



వేములవాడ మండలం సంకెపల్లి గ్రామం మాది. తన ఇళ్లు ముంపునకు గురవుతుంది. అధికారులు వచ్చిన దరఖాస్తులు తీసుకువెళ్లారు. ఇప్పటి వరకు నాకు ఇంటి పరిహారం అందలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాసితులపై శ్రద్ధ తీసుకుని పరిహారం త్వరగా ఇప్పించాలని కోరుతున్నాం.

సంతకాలు తీసుకున్నారు.. పరిహారం రాలేదు..


- జి జ్యోతి, రుద్రవరం, నిర్వాసిత యువతి



మాది రుద్రవరం గ్రామం. ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకారం నేకు పరిహారం అందాల్సిఉంది. గ్రామపంచాయతీకి వచ్చి అధికారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకుని వెళ్లారు. ఇప్పటి వరకు పరిహారం మాత్రం అందలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని పరిహారం అందజేయాలి.

ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రా ధాన్యం ఇస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాము. ఎన్నికల సమయంలో నిర్వాసిత కుటుంబాలకు ఐదు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చాము. గ్రామా నికి ఒక్క ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేసి సమ స్యలను పరిష్కరిస్తాము. 15 రోజుల్లో నిర్వాసి తుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చేస్తాం. కంపెనీల ఏర్పాటుతో నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం.

రాష్ట్రంలో పద్మశాలీల పరిస్థితి దుర్భరం

-ఎంపీ బండి సంజయ్



అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో పద్మశాలీల పరిస్థితి దుర్భరంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని పద్మశాలీ భవన్‌లో హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘం నాయకులు విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కార్యక్రమాలు అభినంద నీయమన్నారు. విద్యార్థుల హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి ఎంపీలాడ్స్ నిధుల నుంచి 10లక్షల రూపాయలు కేటాయించామన్నారు. ఎన్నికల అనంతరం పద్మశాలీల అభివృద్ధికి మరింత సాయం అందిస్తామని బండి సంజయ్ అన్నారు.

శ్రీహరినగర్ కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4: కరీంనగర్ రాంనగర్ పరిధిలోని శ్రీహరినగర్ కాలనీవాసులు ఆదివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. మహిళలు, పిల్లలు, పురుషులు వేర్వేరుగా సినీ గీతాలపై నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కాలనీ సంఘం అధ్యక్షుడు మిర్యాల అనిల్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, కచ్చు రవి, మాజీ కార్పొరేటర్ బీర్ల బీరయ్య, కార్యదర్శి కాసర్ల మల్లేశం, ఉపాధ్యక్షుడు నునుగొండ విరేశం, కోశాధికారి కూర శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి టి.రాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్, ఫిబ్రవరి4: జిల్లా పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-17 పాఠశాలల వేయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండవ రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. రాష్ట్రంలోని 8జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు హాజరై ప్రతిభచాటారు. ఈ పోటీల్లో ప్రతిభచాటి విజేతలుగా నిలిచిన బాలబాలికలను బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక చేశారు. విజేతలకు రాష్ట్ర పర్యవేక్షకులు శ్రీనివాస్ ప్రశంసాపత్రాలు, పతకాలను అందించారు. ఈకార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి పోతన శ్రీనివాస్, పీడీలు, శంకరయ్య, బాబు శ్రీనివాస్, పీఈటీలు ఎల్‌వి రమణ, శ్రీలక్ష్మి, రాజ్‌కుమార్, వి.సూర్యప్రకాశ్, సత్యనారాయణ, డి.సత్యానంద్, ఎస్‌కె సఫియా, వివిధ జిల్లాల నుంచి హాజరై కోచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

కరీంనగర్‌రూరల్, ఫిబ్రవరి4: సైకాలజిస్టుల కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టిపిఎ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. ఆదివారం రేకుర్తిలోని సాన్వి డిఫెన్స్ అకాడమి, జూనియర్ కళాశాలలో తెలంగాణ సైకాలజిస్ట్ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి సైకాలజిస్టులకు కౌన్సిల్ ఏర్పాటు చేయాలని విన్నవించినా పట్టించు కోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌన్సిల్ ఏర్పాటు చేయడానికి కృషిచేయాలని కోరారు. ఈసందర్భంగా రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏగ్రామల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నం చందర్, కళాశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్‌సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆడెపువేణు, సోరుపాక ఐలయ్య, ఎ ఈశ్వర్, కె అనిత, నాగేశ్వర్, వి సతీష్‌కుమార్, అబ్దుల్ అజీజ్, భూమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'గావ్ చలో అభియాన్'ను విజయవంతం చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 4: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న బీజేపీ గావ్ చలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఆదిఆరం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ జాతీయ శాఖ పిలుపు మేరకు సోమవారం నుంచి ప్రారంభంకానున్న గావ్ చలో అభియాన్ (పల్లెకుపోదాం) కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు విజయవంతం చేయాలన్నారు. పదేళ్లలో బీజేపీ మోడీప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడానికి బీజేపీ నాయకత్వం గావ్ ఛలో అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలోని బీజేపీ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పార్టీ అనుబంధ మోర్చా బాధ్యులందరూ విజయవంతం చేయాలన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ హుజూరాబాద్ నియోజక వర్గంలో గావ్ చలో కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. బీజేపీ బాధ్యులు తమకు కేటాయించిన గ్రామాలకుసోమవారం తరలి వెళ్లాలన్నారు.

నియోజకవర్గానికి ఎంపీ నిధులు రాలేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, ఫిబ్రవరి 4: మానకొండూర్ నియోజకవర్గానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్రం నుంచి తెచ్చిన నిధులు ఏమీలేవని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ ఎంపీ పరిధిలోని మానకొండూర్ నియోజకవర్గానికి ఐదేళ్లలో ఒక్క పైసా తీసుకరాకపోవడం బాధాకరమని అన్నారు. నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 90శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. తెలంగాణ ప్రజల తీర్పు మేరకు ప్రతిపక్ష పాత్ర పోషించి సమస్యలపై పోరాడుతామని అన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ హయాంలోనే కరీంనగర్ అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. మరోసారి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తేనే కరీంనగర్ మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచు రొడ్డ పృథ్వీరాజ్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి

-ఎమ్మెల్యే గంగుల కమలాకర్



బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4: బీసీ కులాల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేయడంతో పాటు సంక్షేమానికి పాటుపడతానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో బీసీ సంక్షేమ సంఘం రూపొందించిన 2024 నూతన సంవత్సరం టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీసీల కుల గణన చేపట్టాలని కోరుతు న్నామని, బీఆర్ఎస్ పార్టీ కుల గణనకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్ర మానికి గంగుల కమలాకర్ మద్దతు తెలిపారు. ఈకార్యక్ర మంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరి పరుశరాంగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

భారత జాగృతి కన్వీనర్‌గా పవన్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4: భారత జాగృతి కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన పూసాల పవన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే నియామకం అమలులోకి వస్తుందని, జాగృతి లక్ష్యాలైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ యువత, విద్యార్థి, మహిళల సాధికార తలను కాపాడేందుకు కృషిచేయాలని సూచించారు.

కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 4: నగరంలోని గాయత్రీనగర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా హనుమాండ్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా లెక్కల స్వప్న వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శిగా డి.బ్రహ్మచారి, కోశాధికారిగా సుల్తాన్ కనకయ్య, ఉపాధ్యక్షులుగా గొట్టిముక్కుల కృష్ణప్రసాద్, తంగళ్ళపల్లి ఐలయ్య, గుండి సంపత్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా గొట్టిముక్కుల అశోక్‌ప్రసాద్, కారడ్ల అంజిరెడ్డి, రాపాక విజయేందర్‌రెడ్డి, కోరుకంటి శ్రీనివాస్‌రావు, ఎండి.జహంగీర్, కార్యదర్శిగా కందుకూరి రమేశ్, మేక గంగాధర్, సిలగాని సంతోష్ కుమార్, ఆర్గనైజర్లుగా అంతగిరి శ్రీనివాస్, తంగళ్ళపల్లి దేవేందర్, బండారి కోటేశ్వర్, కాలువ మహేందర్, కార్యవర్గసభ్యులుగా కోటగిరి సాగర్, సుంకరి రమేశ్, యనుమల హరికృష్ణ, సిర్ర నరసయ్య, ముక్కెర ఆంజనేయులు, ఆలేటి తిరుపతి, ఆకుల లింగయ్య, సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

కబడ్డీ జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: జిల్లా సబ్‌జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలకు విశేషస్పందన లభించింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 161 మంది బాలురు, 97 మంది బాలికలు హాజరయ్యారు. వీరికి కబడ్డీ పోటీలు నిర్వహించి విశేషప్రతిభకనబరిచిన క్రీడాకారులను ఈనెల 16 నుంచి 19వరకు సూర్యపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈపోటీల నిర్వహణను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్మెడ లక్ష్మినర్సింహారావు, సిహెచ్.సంతరావు పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో అసోసియేషన్ సభ్యులు సుధాకర్, కరుణాకర్, పద్మ, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్‌రెడ్డి, హరికృష్ణ, రమేశ్, మల్లేశ్, నానిప్, రఘుపతి, పుష్పలత, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యేల పరామర్శ

చొప్పదండి, ఫిబ్రవరి 4: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశం తండ్రి ఇటీవల మరణించగా ఆయన దశదిన కార్యక్రమానికి ఆదివారం మానకొండూర్, చొప్పదండి, పెద్దపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సీహెచ్ విజయరమణారావు, వెడ్మ బొజ్జు హాజరయ్యారు. చొప్పదండి మండలం కొలిమికుంటలో జరిగిన కార్యాక్రమానికి ఎమ్మెల్యేలు హాజరై సత్తు నర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు పులి అంజనేయులుగౌడ్, చొప్పదండి, రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరవేని తిరుపతి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు శ్రావణ్‌నాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, కంకణాల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పోరాటం'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి4: ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ పోరాటం చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రాచారిలు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మికశ్రామిక పీడిత వర్గాల విప్లవోద్యమ నాయ కుడు, రాష్ట్రోపాధ్యాయ సంఘ వ్యవస్థాపకుడు మఖ్దూం మొహియుద్దీన్ వారసత్వాన్ని కొనసాగిస్తూ విద్యా, ఉపాధ్యాయ రంగంలోని సమస్యలపై పోరాడుదామని ఎస్టీయూ జిల్లాశాఖ తీర్మానించింది. ఆదివారం ఎస్టీయు వ్యవస్థాపక అధ్యక్షుడు మఖ్దూం మొహియుద్దీన్ 115వ జయంతి వేడుకలను పురస్కరించుకొని స్థానిక ఎస్టీయు భవన్‌లో జిల్లాశాఖ ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీయూ సంఘ స్థాపకుడైన మఖ్దూం వారసత్వాన్ని కొనసాగిద్దామని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం, బలహీనవర్గాల పక్షపాతిగా సంఘం వ్యవహరిస్తుందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఎస్టీయూ ప్రజాస్వామిక పోరాటంలో ముందుంటుందని అన్నారు. ఈకార్యక్ర మంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి సాన కిషన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గాలేటి తిరుపతిరెడ్డి, కోట్టె లక్ష్మన్ రావు, వెలిచాల వెంకటస్వామి, నాయకులు దాసరి సుభాష్, కందుకూరి శ్రీనివాస్, ఖాజా మిస్బావుద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

కరీంనగర్‌స్పోర్ట్స్, ఫిబ్రవరి 4: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాల సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

అండర్-8,10,12,14 వయసు విభాగాల్లో బాల బాలికలకు రన్స్, త్రోస్, జంప్స్ అంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు లేక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సురేశ్ పతకాలను, బహుమ తులను అందజేశారు. ఈపోటీల్లో గెలుపొం దిన క్రీడాకారులను ఈనెల 10వ తేదీన భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

'బీఆర్‌ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం'

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి4: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్యాట రమేష్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ చేసి అన్ని రకాల ఆదుకుని రైతు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆదుకున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగులు, నిరుద్యోగులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని, విద్యావవస్థ అస్తవ్యస్తమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్ల రూపాయలు దండుకున్నారని, రాష్ట్రం 7కోట్ల అప్పులలో కూరుకు పోయిందన్నారు. పేదలను ఆదుకునరేందుకు ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చిందని, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని నేటి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని 10 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఎంతోమంది విద్యార్థులు, ఉద్యమకారుల ప్రాణత్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. బీర్‌ఎస్ ప్రజావ్యతిరేక, రాచరికపు పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్‌కు మద్దతిచ్చా రన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు మరొకసారి ప్రజలు గుణ పాఠం చెప్పి కాంగ్రెస్‌ను గెలిపిస్తారని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఆకుల మోహన్, ఎలగందుల మల్లేశం, లక్ష్మి, జ్యోతి, తిరుమల, అక్బరుద్దీన్, ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నిలదీస్తే బీఆర్‌ఎస్ నాయకులు నీళ్లు నములుతున్నారు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 4: పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలను అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీస్తే వారు జవాబు చెప్పలేక నీళ్ల నములు తున్నారని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మొగిళిపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమ ణారెడ్డి అధ్యక్షతన సన్మాన మహోత్సవ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదేళ్ల బీఆర్‌ఎస్ అరాచక పాలనను చూసిన ప్రజలు విసిగిపోయి ఓడించారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి 10కోట్ల రూపాయలు మంజూరు చేశారని చెప్పారు. వాటితో పాటు ఇతర నిధులతో గ్రామాలను అభివృద్ధి చెసుకుందామని తెలిపారు. మొగిళిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంపై సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యుత్ బిల్లులు మిగిలేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం తమ పదవి పూర్తి చేసుకున్న సర్పంచ్ మోరపల్లి సుస్మిత రమణారెడ్డి, పాలకవర్గాన్ని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్‌గౌడ్, గోపు మల్లారెడ్డి, ఎలుకపల్లి సంపత్, పోలు రామ్, రమేశ్, లక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గన్నేరువరం, ఫిబ్రవరి 4: జంగపల్లి, మాధాపూర్, హన్మాజిపల్లి, గోపాల్‌పూర్, పీచుపల్లి, గునుకుల కొండాపూర్, చీమలకుంటపల్లి, గుండ్లపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏఈ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సమ్మెను విజయవంతం చేయాలి

చొప్పదండి, ఫిబ్రవరి 4: రోడ్డు రవాణా రంగం కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలని ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న భారత్‌బంద్ కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పొన్నం రవి కోరారు. చొప్పదండిలో ఆదివారం భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ భారత్‌బంద్‌లో రవాణా రంగ కార్మికులు, అన్ని రకాల వాహనాల డ్రైవర్లు, ఆటో క్యాబ్, లారీ, డీసీఎం, స్కూల్ బస్సులు, జీపులు, అంబులెన్సులు, ట్రాక్టర్లు, అద్దెబస్సులు, ట్రాలీ, టాటా ఏసీ, రెడీమిక్స్ డ్రైవర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, అడ్డా అధ్యక్షుడు వంగ సాయి, కోశాధికారి నెల్లి లక్ష్మయ్య, అమరకొండ శంకర్, బుర్ర శేఖర్, బొడిగె మహేశ్, మేడి సాయికుమార్ పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికే పదవులు

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



జమ్మికుంటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్

జమ్మికుంట, ఫిబ్రవరి 4: పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు పదవులు వస్తాయని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. స్థాని కంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలకు స్థానిక ప్రజలు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో అంద రికీ ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ప్రజా పాలన నచ్చి కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారని గుర్తు చేశారు. సమ్మక్క సార లమ్మ జాతరకు చైర్మన్‌ను ఎన్నుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలి పారు. కార్యక్రమంలో నాయకులు పత్తి కృష్ణారెడ్డి, తుమ్మేటి సమ్మిరెడ్డి, పొనగంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో చేరారు. చల్లూరు, కోర్కల్, నర్సింహులపల్లి గ్రామాల బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మాజీ సర్పం చులు కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వారికి వొడితెల ప్రణవ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపట్టే సంక్షేమ పథకాలు వివరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో చల్లూరు మాజీ సర్పంచ్ రాజమల్లు, రాచమల్ల కుమార్, కోమల్‌రెడ్డి, వార్డు సభ్యులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, కొమ్మిడి రాకేష్ రెడ్డి, జీడీ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఫిబ్రవరి 4: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల అల్పాహారానికి దాతగా వ్యవహరిస్తానని ఇచ్చిన మాట ప్రకారం 30 వేలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్ర భుత్వ కళాశాలలో ప్రవేశాలు తీసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రమీల, అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గాభవాని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చొప్పదండి, ఫిబ్రవరి 4: చొప్పదండి పట్టణంలోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మండల పూజ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేవెళ్ళి గ్రామంలో పోచమ్మతల్లి బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పురం రాజేశం, నాయకులు పులి ఆంజనేయులు, కూకట్ల తిరుపతి, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య, ముద్దసాని రంగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4: నగరంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీ సుధీర్‌కుమార్, సాయిని నరేందర్ తెలిపారు. సంతోష్‌నగర్ 11కేవీ, గంజ్ 11కేవీ, ఫీడర్ పరిధిలోని కొత్త లేబర్ అడ్డా, సేయింట్‌జాన్ స్కూలు ఏరియా, శివటాకీస్ ఏరియా, భాగ్యనగర్, జ్యోతినగర్, గంజ్, టోటల్ మార్కెట్ ఏరియా, బోయవాడ, సిక్‌వాడి, అన్నపూర్ణ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్, మదీనా కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సిద్ధార్థ పాఠశాలలో అకాడమిక్ ఎక్స్‌పో

చొప్పదండి, ఫిబ్రవరి 4: చొప్పదండి మండలంలోని సిద్ధార్థ పాఠశాలలో ఆదివారం అకాడమిక్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కో ఆర్డినేటర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మెడికవర్ సేవలు అభినందనీయం'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి4: సామాజిక బాధ్యతగా మెడికవర్ ఆసుపత్రి చేస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక ముకరంపురలోని కేకే హైస్కూలులో మెడికవర్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పేద ప్రజలు నివసించే అన్ని డివిజన్లలో మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలు రోగాల బారిన పడకుండా తీసుకో వలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్‌హుస్సేన్, స్థానిక కార్పోరేటర్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, డివిజన్ అధ్యక్షుడు అజీముల్లా ఖాన్, కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ రామనాథం, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కార్తిక్, గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్టారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సుందరకాండ పద్య కావ్యం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో పెండ్యాల కిషన్ శర్మ రచించిన సుందరకాండ పద్యకావ్యంను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాహితీ వేత్త, హైకోర్టు న్యాయవాది నారుమంచి వెంకట అనంతకృష్ణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ కావ్యంలోని పద్యాలన్ని పంచదార చిలకల వలె ఉన్నాయని అన్నారు. సుందర కాండపై అనేక ప్రవచనాలు చేసిన కిషన్‌శర్మ పాండిత్యం ఈ కావ్యంలో కనిపిస్తుందని అన్నారు. మరో అతిథిగా పాల్గొన్న అవధాని మద్దు రాజయ్య మాట్లాడుతూ సుందరకాండను పద్యాల రూపంలో అతి సుందరంగా తీర్చిదిద్దిన కిషన్‌శర్మ గొప్ప పండితుడని అన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సాహితివేత్తఅవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కిషన్‌శర్మ ఈ కావ్యాన్ని సుందర రత్న ప్రకాశమానం చేశారని, కావ్య సాంప్రదాయ లక్షణాలన్ని మెండుగా ఉన్నాయని అన్నారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో జనార్ధన్‌రావు గంప ఉమాపతి, శంకరయ్య, కృష్ణారావు, వేణుగోపాలశర్మ, లక్ష్మణాచార్యులు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

'కొన్ని మబ్బులు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4: నగరంలోని గణాంక భవన్‌లో ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రచయిత విలాసాగరం రవీందర్ రచించిన కొన్నిమబ్బులు పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర హాజరుకాగా పుస్తకాన్ని సాహితివేత్త అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు ఆవిష్కరించారు. రచయిత గాయకుడు మమతవేణు పుస్తక పరిచయం చేశారు. అతిథులు మాట్లాడుతూరచయితను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు సివికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, ఎక్కలదేవి మధుశ్రీ, గుడికందుల ఆరుణ్‌తో పాటు కవులు, రచయితలు పాల్గొన్నారు.

కళాకారుడికి ప్రతిభా పురస్కారం

గంగాధర, ఫిబ్రవరి 4: మండలంలోని కురిక్యాలకు చెందిన కళాకారుడు(శిల్పి) సముద్రాల ప్రభాకర్ అవుట్ స్టాండింగ్ విశిష్ట ప్రతిభా పురస్కారం అందుకున్నారు. మంచిర్యాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆదివారం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేసింది. ఇందులో భాగంగా శ్రీనివాస్‌కు ప్రతిభా పురస్కారం అందజేశారు. ఈ మేరకు శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

అర్చకులు తరలిరావాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 4: ధూప దీప నైవేద్య అర్చకులు తమ సమస్యలను విన్న వించడానికి సోమవారం కరీంనగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయానికి తరలిరావాలని డీడీఎన్ మండలాధ్యక్షుడు బస్మాని శంకరయ్య, ప్రధాన కార్యదర్శి కాయకంటి రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్ అర్చకులను అన్ని విధాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం కూడా అండగా ఉండా లని విజ్ఞప్తి చేశారు.

'కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు'

హుజూరాబాద్, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ పార్టీని హుజూరాబాద్ ప్రాంత బీఆర్‌ఎస్ నాయకులు విమర్శించడం సరికాదని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. హుజూరాబాద్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసి గెలిచిన గెలుపు అసలు గెలుపే కాదన్నారు. కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ మెప్పు కోసం కౌశిక్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం రెండు నెలలు కూడా కాలేదని చెప్పారు. ఇంతలా దిగజారి బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కచ్చితంగా ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రాన్ని అంధకారం చేయాలని కుట్రలు చేసింది కేసీఆర్ అని, ప్రజలు గమనించి సరైన సమయంలో సరైన తీర్పు ఇచ్చారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వీణవంక, ఫిబ్రవరి4: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు అనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

చిన్నారులకు చేయూత

రామడుగు, ఫిబ్రవరి 4: మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన దైవాల పర్శరాం అనారోగ్యంతో మృతి చెందగా అతడి ఇద్దరు ఆడపిల్లలు అనాథలయ్యారు. దీంతో గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన శ్రీలక్ష్మీనర సింహస్వామి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు 7,500 రూపాయలు అమ్మాయిలకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దాసరి కనుకయ్య, హనుమంతరెడ్డి, మధు, రవిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.